నమస్తే తెలంగాణ
# సూర్యాపేట
5 | నల్లగొండ, సోమవారం 29 ఏప్రిల్ 2024 | SURYAPET

నల్లగొండ పార్లమెంట్‌లో

# బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యే పోరు



**నామ మాత్రంగా కూడా కనిపించని బీజేపీ**

సొంత పార్టీలో లేని సహకారం.. ఏకాకిగా బీజేపీ అభ్యర్థి సైదిరెడ్డి

కేసీఆర్ బస్సు యాత్రతో గులాబీ పార్టీకి పెరిగిన క్రేజ్

సూర్యాపేట, ఏప్రిల్ 28 (నమస్తే తెలంగాణ) : నల్లగొండ పార్లమెంట్‌కు జరుగబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్, కాంగ్రెస్ మధ్యనే పోరు కనిపిస్తున్నది. బీజేపీ నామమాత్రంగా కూడా కనిపించడం లేదు. బీజేపీ అభ్యర్థి శానంపూడి సైదిరెడ్డి పార్టీ మారి టిక్కెట్ తెచ్చుకున్నాడు తప్ప ఆ పార్టీ స్థానిక నాయకత్వం నుంచి ఏ మాత్రం సహకారం లేదు. సూర్యాపేట, కోదాడ నియోజకవర్గాల్లో బీజేపీ జెండాలు మచ్చుకు కూడా కనిపించడం లేదు. హుజూర్‌నగర్‌తో పాటు నాగార్జునసాగర్ నియోజకవర్గాల్లో అంతంత మాత్రంగానే ప్రచారం చేస్తున్నారు. బీఆర్ఎస్ నుంచి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తన వెంట వస్తారనుకున్న సైదిరెడ్డికి మాజీ మంత్రి, సూర్యాపేట శాసనసభ్యుడు జగదీశ్‌రెడ్డి చాతుర్యంతో ఒక్కరు కూడా వెళ్లలేదు. కాగా మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మిర్యాలగూడ, సూర్యాపేటలో చేపట్టిన బస్సుయాత్రతో గులాబీ పార్టీకి క్రేజ్ పెరిగింది. సాగు, తాగు నీరు రాకపోవడం, విద్యుత్ కోతలు, రైతుబంధు కట్, రుణమాఫీ చేయకపోవడం తదితర కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలపై కేసీఆర్ వివరించడంతో పార్లమెంట్ ఎన్నికల్లో ఆ పార్టీకి బుద్ధి చెప్పాలనే ఆలోచనలో ప్రజలు ఉన్నారు. బీఆర్ఎస్‌కు జనం మద్దతు, కాంగ్రెస్ పార్టీలో ఎమ్మెల్యేల బలం ఉండగా ప్రచారంలో ఆ రెండు పార్టీల జెండాలే దర్శనమిస్తున్నాయి. బీజేపీ అయితే ఏకాకి అయినట్లు కనిపిస్తున్నది.

**పాత కేడర్ నుంచి సైదిరెడ్డికి లభించని సహకారం**

సూర్యాపేట జిల్లా పరిధిలోని బీజేపీ పాత కేడర్ నుంచి అభ్యర్థి శానంపూడికి ఆశించిన స్థాయిలో కాదు అసలు సహకారమే లేదని చెప్పవచ్చు. జిల్లా బీజేపీలో తొంభై శాతం సైదిరెడ్డిని వ్యతిరేకిస్తున్నారు. నల్లగొండ ఎంపీ అభ్యర్థిత్వాన్ని మార్చాలని అధిష్ఠానం వద్ద పట్టుబట్టినట్లు ప్రచారం కూడా జరిగిన విషయం విదితమే. ఇక పార్టీ మారిన తరువాత సైదిరెడ్డి హుజూర్‌నగర్‌తోపాటు ఇతర నియోజకవర్గాల్లోని బీఆర్ఎస్‌తోపాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తల కోసం రెండు మూడు వారాల పాటు ఎన్ని ఫోన్లు చేసినా ఫలితం లేకపోయింది. కొద్ది రోజులుగా కలిసి వచ్చే కొద్దిమందితో గుళ్లు, గోపురాలు తిరుగుతూ నల్లగొండ జిల్లా కేంద్రంతో పాటు ఆ జిల్లా పరిధిలోని నియోజకవర్గాల్లో ఒకటి రెండు సార్లు సమావేశాలు, ఉన్న ఒకరిద్దరితో ఒకటి, రెండు గ్రామాల్లో పర్యటించి వెళ్తున్నారు. ఇటీవల నల్లగొండలో బీజేపీ పార్లమెంటరీ నియోజకవర్గ స్థాయి సమావేశం నిర్వహిస్తే నాగార్జునసాగర్ ఇన్‌చార్జి కంకణాల నివేదితారెడ్డి మినహా మిగిలిన ఆరు నియోజకవర్గాల ఇన్‌చార్జిలు హాజరుకాలేదు. కాగా సైదిరెడ్డికి టిక్కెట్ వచ్చిన తరువాత ఇప్పటి వరకు కూడా బీజేపీ సీనియర్ నాయకులు సంకినేని వెంకటేశ్వర్‌రావు, గొంగిడి మనోహర్‌రెడ్డి, జుట్టుకొండ సత్యనారాయణతోపాటు నల్లగొండ, సూర్యాపేట జిల్లా నాయకులు పత్తాలేరు. సంకినేని వెంకటేశ్వర్ రావుకు అసెంబ్లీ ఎన్నికల్లో 40వేల ఓట్లు రాగా ఈ సారి ఆ ఊపే కనిపించడం లేదు. సీనియర్లు మొత్తం అసంతృప్తితో ఉండగా పార్టీ అధిష్ఠానం కూడా పట్టించుకున్నట్లు కనిపించడం లేదు. దాంతో అభ్యర్థి సైదిరెడ్డి ఓ పదిమందిని వెంటేసుకొని పర్యటిస్తున్నారు. తన సొంత నియోజకవర్గం అయిన హుజూర్‌నగర్‌లో బీఆర్ఎస్ శ్రేణులు ఒక్కరూ కూడా ఆయన వెంట లేరు. అంతా బీఆర్ఎస్‌లోనే ఉన్నారు.

## నాటి గొడవతో అసంతృప్తి

నాటి బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ప్రజాసంగ్రామ యాత్రలో భాగంగా మఠంపల్లి మండలంలో భూములు కబ్జా చేశారని అక్కడ ఉన్న ఫెన్సింగ్‌లను తొలగించడంతో బీజేపీ, బీఆర్ఎస్ మధ్య ఓ యుద్ధమే జరిగింది. అప్పుడు బీజేపీ నాయకులపై కేసులు కాగా దానికి కారణమైన సైదిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడం పట్ల జిల్లా బీజేపీలో తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. సైదిరెడ్డికి నల్లగొండ పార్లమెంట్ టికెట్ వచ్చి 50 రోజులు గడుస్తున్నప్పటికీ సూర్యాపేటలో అడుగు కూడా పెట్టకపోగా కోదాడ, నాగార్జునసాగర్, దేవరకొండ నియోజకవర్గాల్లో ఒకటి రెండు సార్లు మాత్రమే వెళ్లారు. ఇక బీజేపీకి ఎంతో సేవలు అందించిన గుండగోని మైసయ్య వర్ధంతి సభకు సైదిరెడ్డి హాజరుకాలేదు. దాంతో పార్టీలో బీసీలకు విలువ లేదా అని గొంతెత్తిన బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్‌గా పనిచేసిన పాలకూరి రవితోపాటు ఆయన భార్య రమాదేవి ఇద్దరూ ఇండిపెండెంట్లుగా నామినేషన్లు వేశారు. అంతేకాకుండా సీనియర్ నాయకులు నూకల నర్సింహారెడ్డి కూడా ఇండిపెండెంట్‌గా నామినేషన్ వేశారంటే సైదిరెడ్డికి బీజేపీలో ఏమాత్రం సహకారం ఉందో అర్థమవుతుంది. నల్లగొండ పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో బీజేపీ ఆనవాళ్లు అంతంత మాత్రంగా కూడా కనిపించకపోగా, అనేక వైఫల్యాలతో కాంగ్రెస్ పార్టీ ముక్కుతూ మూలుగుతూ ముందుకు సాగుతున్నది. కేసీఆర్ బస్సుయాత్రతో బీఆర్ఎస్ మాత్రం ముందంజలో కనిపిస్తున్నది.

## భువనగిరి మీదుగా వరంగల్ వెళ్లిన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

భువనగిరి అర్బన్, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా వరంగల్‌లో జరిగే రోడ్‌షోకు బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ ఆదివారం సాయంత్రం ఎర్రవెల్లి ఫాంహౌస్ నుంచి బస్సులో బయల్దేరి తుర్కపల్లి, భువనగిరి, ఆలేరు, జనగాం మీదుగా వెళ్లారు. వివిధ వర్గాల ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రోడ్డు వెంట ఉండి జేజేలు పలికారు. కేసీఆర్ కూడా ప్రజలకు అభివాదం చేస్తూ ముందుకు సాగారు.




తుర్కపల్లిలో ప్రజలకు అభివాదం చేస్తున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

# కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయం

## కేసీఆర్ సాగు నీళ్లు తెస్తే.. కాంగ్రెస్ కన్నీళ్లు తెచ్చింది

- ముల్లు కర్రతో గుచ్చితేనే ఈ ప్రభుత్వానికి మేలుకొలుపు
- ఉత్తమ్ నీటి పారుదల శాఖ మంత్రిగా ఉన్నా జిల్లాకు చేసిందేమీ లేదు
- బీఆర్ఎస్ అభ్యర్థి కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి



ఎన్నికల ప్రచారంలో భాగంగా మోతెలో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి, పక్కన బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

మోతె/ నడిగూడెం, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని బొంద పెట్టడం ఖాయమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. మోతె, నడిగూడెం మండల కేంద్రాల్లో ఆదివారం సాయంత్రం బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థి కంచర్ల కృష్ణారెడ్డితో కలిసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కాలం తెచ్చిన కరువు కాదిది.. కాంగ్రెస్ తెచ్చిన కరువు అన్నారు. కేసీఆర్ అధికారంలోకి వచ్చి రైతు పొలాలకు నీళ్లు తెస్తే.. కాంగ్రెస్ సర్కారు వచ్చి రైతుల కళ్లలో నీళ్లు తెచ్చిందని పేర్కొన్నారు. బీఆర్ఎస్ హయాంలో మోతె మండలానికి కాళేశ్వరం ద్వారా రెండు పంటలకు నీరు అందించి సస్యశ్యామలం చేశామని చెప్పారు. ఎవరికి వేసిన ఓటు మంచి చేసిందో ఆలోచించాలని ప్రజలకు సూచించారు. కాంగ్రెస్ వాళ్లను ముల్లుకర్రతో గుచ్చి అనగపెట్టి పని చేయించుకోవాలని, లేకుంటే వాళ్లకు పని చేసే చేతకాదని అన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీ అంటే నమ్మి ఓటేస్తే రైతు బంధు ఇవ్వలేదని, ఎకరాకు రూ.15వేలు ఎక్కడ పోయాయని ప్రశ్నించారు. వడ్లకు క్వింటాకు రూ.500 బోనస్, మహిళలకు రూ.2500, కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు తులం బంగారం, నిరుద్యోగులకు రూ.4వేల భృతి ఇస్తామని చెప్పి ఇప్పటికీ నెరవేర్చలేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే కాలేజీ విద్యార్థినులకు డిసెంబర్ 9న ప్రియాంకగాంధీ లక్ష స్కూటీలు ఇస్తామని చెప్పారు.. వచ్చాయా? అని అక్కడి ప్రజలను ప్రశ్నించారు. ఆటో కార్మికులకు రూ.12వేలు ఇస్తామని చెప్పి బువ్వకు కూడా లేకుండా చేశారని ఆరోపించారు.

రూ.4వేల పెన్షన్ ఇస్తామని చెప్పి ఇవ్వకుండా ముసలోళ్లను కూడా మోసం చేశారని అన్నారు. కాళేశ్వరం జలాలతో రైతులకు నీరు అందించి ఆదుకున్నామని, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నీటి పారుదల శాఖ మంత్రిగా ఉండి ఇక్కడి పొలాలను ఎండబెట్టారని తెలిపారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి మంత్రిగా అందించిన బహుమానం 12నుంచి 14లక్షల ఎకరాలు ఎండబెట్టడమేనని ఎద్దేవా చేశారు. అదే కేసీఆర్ గెలిచి ఉంటే ఈ రోజు మన నీళ్లు మనకు వచ్చేవని.. మన సంక్షేమ నిధులు మనకు అందేవని అన్నారు. బీఆర్ఎస్ పార్టీనే శ్రీరామరక్ష అని, కారు గుర్తుకు ఓటు వేసి కంచర్ల కృష్ణారెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమాల్లో మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్, ఎంపీపీ యాతాకుల జ్యోతి, బీఆర్ఎస్ మండలాధ్యక్షులు శీలం సైదులు, నర్సిరెడ్డి, నాయకులు చంద్రయ్య, ఆంజనేయులు, మహేశ్, ఖలీల్ అహ్మద్, మధుసూదన్‌రెడ్డి, లింగారెడ్డి, వెంకటేశ్వర్‌రావు, సతీశ్, మల్సూర్, ముత్తయ్య, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నడిగూడెంలో బీఆర్ఎస్ రోడ్‌షోకు హాజరైన జనం



మోతెలో..

# సార్వత్రిక ఎన్నికలపై పటిష్ట నిఘా

- జిల్లాలో మూడు అంతర్రాష్ట్ర, ఐదు అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు
- 19 స్పెషల్ సర్వేలైన్స్, 12 స్టాటికల్ సర్వేలైన్స్ టీమ్స్
- ఎన్నికల తాయిలాలపై ఉక్కుపాదం
- ఇప్పటివరకు 11కోట్ల మేర నగదు, ఆభరణాలు సీజ్
- 116 ఆయుధాలు డిపాజిట్, 847 మంది బైండోవర్

నీలగిరి, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో జిల్లా పోలీస్ యంత్రాంగం పటిష్ట నిఘా ఏర్పాటు చేసింది. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా ఉండేందుకు చర్యలు తీసుకుంటున్నది. జిల్లా వ్యాప్తంగా మూడు అంతర్రాష్ట్ర, ఐదు అంతర్ జిల్లా చెక్ పోస్టులను, 31 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి క్షుణ్ణంగా తనిఖీలు చేస్తున్నది. దీంతో ఇప్పటి వరకు 11 కోట్ల మేర నగదుతోపాటు వివిధ రకాల బంగారు అభరణాలు, వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సుమారు 400 పైచిలుకు కేసుల్లో 847 మంది అనుమానితులను బైండోవర్ చేశారు. వ్యాపారులు, రాజకీయ నాయకుల నుంచి లైసెన్స్ కలిగిన 116 ఆయుధాలను డిపాజిట్ చేయించారు.

సార్వత్రిక ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు జిల్లా పోలీస్ శాఖ పకడ్బందీ చర్యలు చేపట్టింది. ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు ప్రజలంతా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ప్రశాంత వాతావరణం కల్పించే దిశగా ఏర్పాట్లు చేస్తున్నది. ఎక్కడా శాంతిభద్రతల సమస్యలు, ఘర్షణలు చోటు చేసుకోకుండా పటిష్టమైన చర్యలు తీసుకున్నారు. జిల్లా వ్యాప్తంగా లైసెన్స్ కలిగిన వ్యక్తుల నుంచి 116 ఆయుధాలను డిపాజిట్ చేయించారు. 187 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు సిబ్బందిని నియమించి ప్రత్యేక దృష్టి సారించారు.

**మద్యం, డబ్బు ప్రభావంపై నిఘా**

పార్లమెంట్ ఎన్నికల్లో మద్యం, డబ్బు ప్రలోభాలకు తావులేకుండా సజావుగా ఎన్నికల నిర్వహణ కోసం జిల్లా పోలీస్ శాఖ పటిష్టమైన చర్యలు చేపట్టింది. బెల్టు షాపులన్నింటినీ మూసివేయడంతోపాటు నిరంతర నిఘా ఏర్పాటు చేసి మద్యం ప్రవాహం ఓటర్లపై ఉండకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నది. ఎక్సైజ్ శాఖతో సమన్వయం చేసుకుంటూ ఇప్పటి వరకు 140 కేసులను నమోదు చేయడంతోపాటు రూ.26.25లక్షల విలువ కలిగిన 44వేల లీటర్ల మద్యం సీజ్ చేశారు. ఓటర్లపై డబ్బు ప్రవాహం ఉండకుండా క్రమం తప్పకుండా వాహనాల తనిఖీ చేపడుతున్నారు. జిల్లాలో నాగార్జునసాగర్, వాడపల్లి, అడవిదేవులపల్లి వద్ద అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు, కేతేపల్లి మండలం కొర్లపహాడ్, చిట్యాల మండలం గుండ్రాంపల్లి, డిండి, సాగర్, మాల్ వద్ద అంతర్ జిల్లాల చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి సీసీ కెమెరాలు అమర్చారు. అంతేకాకుండా 19 స్టాటికల్ సర్వేలైన్స్, 12 స్పెషల్ సర్వేలైన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారు.

**11 కోట్ల విలువైన ఆభరణాలు, నగదు సీజ్**

పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా మద్యం, డబ్బు అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా ఐదు చెక్‌పోస్టులు ఏర్పాటు చేశారు. అదేవిధంగా జిల్లాలో ఫిర్యాదులు చేసేందుకుగాను కలెక్టరేట్‌లో కంట్రోల్ రూమ్ 08682 221300, టోల్‌ఫ్రీ నెంబర్ 18004251442 ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు పటిష్టంగా ఎన్నికల నియమావళిని అమలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 5కోట్ల విలువైన బంగారు ఆభరణాలు, మూడు కోట్ల విలువైన వస్తువులు, మరో మూడు కోట్ల నగదు సీజ్ చేశారు.

**ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు చర్యలు**

- ఎస్పీ చందనాదీప్తి

ఎన్నికలు పారదర్శకంగా నిర్వహించేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని రకాల చర్యలు తీసుకున్నాం. ప్రశాంత వాతావరణంలో ప్రజలు ఓటు వేసేలా బందోబస్తు నిర్వహించాం. ఓటర్లు మద్యం, డబ్బు ప్రలోభాలకు గురికావద్దు. స్వేచ్ఛాయుత వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి. ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా ఉండేందుకు, ఇతర ప్రాంతాల ప్రజలు వచ్చి జిల్లాలో అలజడులు సృష్టించకుండా ఉండేందుకు ఐదు అంతర్ జిల్లా, మూడు అంతర్రాష్ట్ర చెక్ పోస్టులను ఏర్పాటు చేశాం. ఇప్పటి వరకు సుమారు 11 కోట్ల విలువైన వివిధ రకాల వస్తువులు, నగదును స్వాధీనం చేసుకుని 847 మందిని బైండోవర్ చేయడం జరిగింది. జిల్లాలో 140 మంది ఆయుధాల లైసెన్స్‌లు కలిగి ఉండగా.. అందులో 116 మంది వద్ద ఉన్న ఆయుధాలను డిపాజిట్ చేయించాం.

**471 బైండోవర్ కేసులు నమోదు**

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఘర్షణలకు పాల్పడే వారితోపాటు ప్రేరేపించే వారిని, రౌడీషీటర్లు, పాత నేరస్తులను ఇప్పటికే బైండోవర్ చేయడం జరిగింది. 471 బైండోవర్ కేసులకు సంబంధించి 847 మందిని బైండోవర్ చేశారు. వీరందరిపై గట్టి నిఘా ఏర్పాటు చేశారు. తిరిగి నేరాలకు పాల్పడే వారిని గుర్తించి బైండోవర్ నగదును జప్తు చేశారు.

## 1.16లక్షల నగదు పట్టివేత

మిర్యాలగూడ, ఏప్రిల్ 28 : ఏపీలోని ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఓ వ్యక్తి నుంచి పోలీసులు రూ.1.16లక్షలు పట్టుకున్నారు. టూ టౌన్ సీఐ పి.నాగార్జున తెలిపిన వివరాల ప్రకారం.. మిర్యాలగూడ పట్టణంలోని నందిపహాడ్ ఎక్స్ రోడ్డు వద్ద ఆదివారం ఉదయం పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సమయంలో ఒంగోలు నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న శ్రీనివాస్‌రెడ్డి అనే వ్యక్తి కారు తనిఖీ చేయగా ఆధారాలు లేకుండా లభ్యమైన రూ.1.16లక్షలను గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. అదేవిధంగా దామరచర్ల వైపు నుంచి హైదరాబాద్ వైపు టాటా ఏస్‌లో వెళ్తున్న గుట్ట స్వామి వద్ద 140 గ్యాస్ స్టవ్‌లను స్వాధీనం చేసుకొని జిల్లా ట్రెజరీ ఆఫీసుకు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.



స్టవ్‌లను స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

## క్యామ మల్లేశ్ గెలుపునకు కృషి చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చిత్రంలో జడ్పీ చైర్మన్ సందీప్‌రెడ్డి

రామన్నపేట, ఏప్రిల్ 28 : భువనగిరి పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి క్యామ మల్లేశ్ గెలుపు కోసం పార్టీ కార్యకర్తలు కష్టపడి పని చేయాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. మండల కేంద్రంలో ఆదివారం జరిగిన బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో యాదాద్రి జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా చిరుమర్తి మాట్లాడుతూ అధికారం, పదవులతో సంబంధం లేకుండా కష్టపడే ప్రతి కార్యకర్తకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందన్నారు. కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ఈ విషయాన్ని బూత్ స్థాయిలో ప్రజలకు వివరించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రజలు బీఆర్ఎస్ పార్టీని కోరుకుంటున్నారని, పార్టీ అభ్యర్థి గెలుపు కోసం కృషి చేయాలని సూచించారు.

## విధుల్లో అప్రమత్తంగా ఉండాలి

**ఎన్నికల అబ్జర్వర్లు మనోజ్‌కుమార్, మాణిక్‌రావు, సూర్యవంశీ**



మట్టపల్లి అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును పరిశీలిస్తున్న ఎన్నికల అబ్జర్వర్లు మనోజ్‌కుమార్, మాణిక్‌రావు, సూర్యవంశీ

మఠంపల్లి/ నేరేడుచర్ల/ గరిడేపల్లి, ఏప్రిల్ 28 : పార్లమెంట్ ఎన్నికల విధుల్లో అప్రమత్తంగా ఉండాలని ఎన్నికల అబ్జర్వర్లు మనోజ్ కుమార్, మాణిక్‌రావు, సూర్యవంశీ సూచించారు. మండలంలోని మట్టపల్లి కృష్ణానది వద్ద ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టును ఆదివారం వారు పరిశీలించారు. చెక్‌పోస్టు రికార్డులను, సీజ్ చేసిన వాటి వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద తాగునీరు, విద్యుత్ సదుపాయాలు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలని, బందోబస్తు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. అనంతరం నేరేడుచర్ల, గరిడేపల్లిలోని జిల్లా పరిషత్ ఉన్నత, కేంద్ర ప్రాథమిక పాఠశాలల్లోని పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. చిల్లేపల్లి చెక్ పోస్ట్ వద్ద ప్రతి వాహనాన్ని తనిఖీ చేయాలని సూచించారు. వారి వెంట తాసీల్దార్లు సురిగి సైదులు, బండ కవిత, మున్సిపల్ కమిషనర్ అశోక్‌రెడ్డి, ఆర్ఐ రాంబాబు, బీఎల్ఓలు ఉన్నారు.